ట్రాన్స్‌టెర్రర్



దాంపూర్- ధర్మారం మధ్య కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్



కాజిపల్లిలో ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



బూర్గుపల్లి వద్ద కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

భీమారం: మండలంలోని వివిధ గ్రామాల్లో వ్యవసాయరంగానికి విద్యుత్ సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయలేదు. ఎవరైనా ప్రమాదవశాత్తు తగిలితే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. బూర్గుపల్లి, కాజిపల్లి, దాంపూర్ గ్రామాల్లోని ప్రధాన రోడ్డుకి సమీపంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లపై కూడా విద్యుత్‌శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలన్న నిబంధనలను విద్యుత్‌శాఖ అధికారులు ఖాతరు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని కంచెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

తుప్పు.. ముప్పు





దండేపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ రోడ్డులో గల ఎస్ఎస్-2/ఏ6 ఇనుప విద్యుత్ స్తంభం కింది భాగంలో తుప్పుపట్టింది. దీంతో అది ఎప్పుడు విరిగి పడుతుందో కూడా తెలియడం లేదు. జనసంచారం ఉండే ప్రాంతంలో ఉండడంతో ఏం జరుగుతుందో అని ప్రజలు జంకుతున్నారు. ఎలాంటి ప్రమాదం జరగకముందే విద్యుత్ అధికారులు స్పందించి తుప్పు పట్టిన ఇనుప విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

క్లుప్తంగా

బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు అవగాహన



మాట్లాడుతున్న కొండల్‌రావు

పాతమంచిర్యాల: టెలికాం రెగ్యులేటరీ అథారిటీ నిబంధనలు అనుసరించి జిల్లాలో ఎలాంటి అంతరాయం లేకుండా బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్, మొబైల్ సేవలు అందిస్తుందని టెలీ కాం డివిజనల్ ఇంజనీర్ కొండల్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ భవన్‌లో మంగళవారం వినియోగదారులకు ఫైబర్‌నెట్ ప్లాన్‌లు, ప్రీపెయిడ్ ప్లాన్‌లు, సైబర్ నేరాల భారిన పడకుండా తీసుకునే జాగ్రత్తలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌డీఈ క్రాంతికుమార్, చంద్రమౌళి, వెంకటి, జేటీఓలు రాజేశం, రాజేష్, దుర్గయ్య, సంతోష్ వినియోగదారులు పాల్గొన్నారు.

నూతన ఫీడర్ ప్రారంభం

భీమిని: ప్రజలకు అంతరాయం లేకుండా విద్యుత్ అందించడమే లక్ష్యమని మంచిర్యాల ఎస్ఈ గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం వడాల, భీమిని గ్రామాలకు వేర్వేరుగా 11కేవీ ఫీడర్‌ను అమర్చి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ టెక్నికల్ కైసర్, ఏడీఈ రవికుమార్, ఏఈ రాజనర్సు పాల్గొన్నారు.

ఈతచెట్లు నరికిన వారిపై చర్య తీసుకోవాలి

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి, చింతలపల్లి గ్రామాల్లో తాటి, ఈత చెట్లను రంపం ద్వారా కోసి కూల్చివేసిన వ్యక్తులపై ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ గౌడ సంఘం మండల అధ్యక్షులు భాస్కర్ గౌడ్ డిమాండ్ చేశారు. ఇందన్‌పల్లి గీత కార్మికులతో కలిసి మంగళవారం కూల్చివేసిన చెట్లను పరిశీలించి మాట్లాడారు. గీత కార్మికులకు ఉపాధిని చూపే ఈత, తాటి చెట్లను నరికివేయడం సబబు కాదన్నారు. చెట్లను నరికిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్సాహంగా ఆటలపోటీలు



ఆటలపోటీల్లో పాల్గొన్న మహిళలు

మంచిర్యాలటౌన్/రామకృష్ణాపూర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్కేపీ సింగరేణి ఠాగూర్ స్టేడియంలో మంగళవారం మహిళలకు ఆటలపోటీలు నిర్వహించారు. కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్, టగ్ ఆఫ్ వార్, మ్యూజికల్ చైర్ అంశాల్లో పోటీలు నిర్వహించగా మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ (టీపీఏ) ఆధ్వర్యంలో మంగళవారం కృష్ణవేణి టాలెంట్ స్కూల్లో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్‌లోని మహిళా సైకాలజిస్టులను శాలువాతో సన్మానించి, బహుమతులు అందించారు.

ఇసుక బంగారమాయె!



మండల కేంద్రంలో ఇసుక లేక పిల్లర్లకే పరిమితమైన ఇంటి పనులు

- నిలిచిపోతున్న ప్రభుత్వ, గృహనిర్మాణ పనులు
- అనుమతి ఇవ్వాలని వేడుకుంటున్న ప్రజలు

వేమనపల్లి: ఈ చిత్రంలో కనిపిస్తున్నది జాజులపేట ప్రైమరీ పాఠశాల ప్రహరీ. నిర్మాణం కోసం పిల్లర్లు తవ్వారు. తర్వాత ఇసుక లేక నెల రోజులుగా పనులు నిలిచిపోయాయి. కనీసం రెండు ట్రిప్పుల ఇసుక కూడా తెచ్చుకోవడానికి అధికారులు అనుమతి ఇవ్వడం లేదు. ఇలా జాజులపేటనే కాకుండా 18 పాఠశాలల్లో ప్రహరీ పనులు ఆగిపోయాయి. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి.. చివరకు చనిపోయిన వారికి సమాధి నిర్మించడానికి కూడా ఇసుక దొరకడం లేదు. ఎడ్లబండికి రూ.250 చెల్లించి ఇసుక తెచ్చుకుంటున్నారు. మండల కేంద్రానికి పక్కనే ప్రాణహిత నదిలో నాణ్యమైన ఇసుక ఉన్నా తీసుకోలేని దుస్థితి. ప్రాణహితలో ఇసుక తవ్వకానికి అనుమతి లేదు. ప్రభుత్వ నిబంధనలతో రెండు నెలలుగా ఇసుక తవ్వకాలు నిలిచిపోయాయి. ఆరు నెలల క్రితం ఎలాంటి ఆంక్షలు లేకుండా నదులు నుంచి ఇసుక తెచ్చుకుని ఇళ్లు నిర్మించుకునేవారు. కానీ ఇప్పుడు ఇసుక తేవాలంటే ఇబ్బందిగా మారింది.

సర్కారుకే ఆదాయం..

ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణాలకు ఇసుక వినియోగం ఎక్కువ. కాబట్టి ప్రభుత్వం ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేస్తే ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఏడాది క్రితం చెన్నూర్, కోటపల్లి, జైపూర్ మండలాల్లో సమీప ప్రాణహిత గోదావరి నదులతోపాటు వాగులలో ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతి ఇచ్చారు. ఒక్కో వినియోగదారుడు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటే ట్రాక్టర్ల సహాయంతో ఇంటికే తీసుకువచ్చి పోసేవారు. ఈ పద్ధతితో ప్రభుత్వానికి లక్షల్లో ఆదాయం సమకూరింది. తాజాగా తవ్వకాలు నిలిపివేయడంతో ఇసుక బంగారమైంది. మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు శ్రద్ధ వహించి ప్రాణహిత నదిలో ఇసుక రీచ్ ఏర్పాటు చేయాలని మండలవాసులు కోరుతున్నారు.



జాజులపేటలో నిలిచిపోయిన పాఠశాల ప్రహరీ పనులు

ఇంటిగ్రేటెడ్‌కు తొలి అడుగు!

- రెబ్బనపల్లి పాఠశాలకు రూ.200కోట్లు
- త్వరలో నిర్మాణ పనులు

దండేపల్లి: కులాలకు అతీతంగా విద్యార్థులందరూ ఒకేచోట చదువుకునేలా అంతర్జాతీయ సౌకర్యాలతో ప్రతీ నియోజకవర్గానికి ఒక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం గతేడాది ప్రకటించింది. ఈ మేరకు మంచిర్యాల నియోజకవర్గానికి మంజూరైన పాఠశాలను దండేపల్లి మండలం రెబ్బనపల్లిలో నిర్మించనున్నారు. దీనికి గతేడాది అక్టోబర్ 11న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్ భూమిపూజ చేశారు. తాజాగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలకు ఒక్కోదానికి రూ.200కోట్లు కేటాయిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రెబ్బనపల్లిలో నిర్మించే ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి అడుగు ముందుకు పడింది. మొదటి విడతలో మంచిర్యాల నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల మంజూరు కాగా, రెండో విడతలో చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలకు ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ప్రభుత్వం మంజూరు చేసింది.



రెబ్బనపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి ఎమ్మెల్యే, కలెక్టర్ భూమిపూజ(ఫైల్)

త్వరలో టెండర్లు..

ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌లు తయారు చేస్తున్నాం. అవిపూర్తికాగానే త్వరలో టెండర్లు పూర్తిచేసి, పనులు ప్రారంభిస్తాం.

- రమేశ్, ఆర్అండ్‌బీ డీఈ

ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ...

మంచిర్యాల నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి సంబంధించి ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఇందుకోసం నియోజకవర్గంలోని దండేపల్లి మండలాన్ని ఎంపిక చేశారు. రెబ్బనపల్లి శివారులోని సర్వే నంబర్ 521లోని ప్రభుత్వ భూమిలో సుమారు 22ఎకరాల స్థలాన్ని అదనపు కలెక్టర్ మోతీలాల్, అధికారులతో కలిసి గత ఆగస్టు 27న పరిశీలించారు. అక్టోబర్ 11న భూమిపూజ చేశారు. రూ.200 కోట్లు నిధులు కేటాయించడంతో, 4బ్లాకులతో డే అండ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాలందరికీ, ఒకేచోట, ఒక్కో బ్లాక్‌కు 640మంది చొప్పున మొత్తం 2,560మంది విద్యార్థులు చదువుకునేలా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

- ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్

జన్నారం: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, ప్రతి పేదోడికి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 92మందికి కల్యాణ లక్ష్మి, ఐదుగురికి షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయమన్నారు. పేదింటి ఆడపడుచులకు కల్యాణ లక్ష్మి ఆర్థికంగా ఎంతో మేలు చేస్తుందన్నారు. పల్లెల్లోని అన్ని వర్గాల ప్రజలు బాగు పడినప్పుడే ప్రభుత్వం బాగుటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

కార్యక్రమంలో తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డి, ఎంపీడీవో హుమర్ షరీఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీ నారాయణ, వైస్ చైర్మన్ ఫసీవుల్లా, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, పార్టీ నాయకులు ఇందయ్య, రమేష్, కరుణాకర్, రియాజుద్దీన్, సతీష్, రాకేష్, శంకరయ్య, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సోమనపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



బెల్లంపల్లిలో...

బెల్లంపల్లి/కాసిపేట: రాష్ట్రవ్యాప్త కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లికి సమీకృత గురుకుల విద్యాలయాన్ని మంజూరు చేయడాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డెప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం నిర్వహించారు. బెల్లంపల్లి బజారు ఏరియా సర్దార్ భగత్‌సింగ్ విగ్రహం ఎదుట, కాసిపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం నిర్వహించి నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో బెల్లంపల్లిలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎం.సూరిబాబు, మాజీ చైర్‌పర్సన్ శ్వేత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రచారకమిటీ సభ్యుడు నాతరి స్వామి, సీనియర్ నాయకుడు రమేష్, కాసిపేటలో పార్టీ మండలాధ్యక్షుడు ప్రదీప్, నాయకులు పాల్గొన్నారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని సోమనపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్లో కాంప్లెక్స్ భవనాల నిర్మాణానికి రూ.200కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్, ఎంపీ వంశీకృష్ణ చిత్రపటాలకు మంగళవారం కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు.

డంపుయార్డ్‌ను తొలగించాలి

శ్రీరాంపూర్: సీసీసీ ముక్కిడి పోశమ్మ ఆలయ సమీపంలోని సింగరేణి స్థలం ఏర్పాటు చేసిన చెత్త డంప్‌యార్డును వెంటనే తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుర్మిళ్ల వేణు ఆధ్వర్యంలో ఆర్కే 5 కాలనీ, టీచర్స్ కాలనీ, సీసీసీ టౌన్‌షిప్, బంగ్లా ఏరియాలో నివాసం ఉన్న వారు మంగళవారం ఏరియా జీఎం శ్రీనివాసులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీల మధ్య డంప్‌యార్డు ఉండటం వల్ల తీవ్ర ఇబ్బంది పడుతున్నామన్నారు. చెత్త వాసనతో పాటు దాన్ని కాల్చివేయడం వల్ల దట్టమైన పొగవచ్చి ఊపిరి ఆడటం లేదన్నారు. రాత్రయితే నిద్ర పోలేకపోతున్నామన్నారు. పొగ వల్ల చాలా మంది దగ్గు, దురదలతో బాధపడుతున్నారన్నారు. వెంటనే డంప్‌యార్డును ఇక్కడి నుంచి దూరంగా తరలించాలని డిమాండ్ చేశారు.



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మెటీరియల్ కొరత తీర్చాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఆర్కే 5గనిలో వర్కింగ్ మెటీరియల్ కొరతను తీర్చాలని గుర్తింపు సంఘం నాయకులు యాజమాన్యాన్ని కోరారు. ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీసైదాలు మంగళవారం ఆ గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గని మేనేజర్‌ను కలిసి సమస్యలను వివరించారు. సమస్యలను సత్వరమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోతుక్కూరి కొమురయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ గొర్రె నర్సయ్య, ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, నాయకులు బద్రి బుచ్చయ్య, ఫిట్ సెక్రటరీ గునిగంటి నరసింగరావు, అసిస్టెంట్ సెక్రటరీ లక్కిరెడ్డి సత్తిరెడ్డి పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న నాయకులు

■ బొగ్గుబాయి వార్తలు

ప్రైవేటీకరణను అడ్డుకోవాలి



కార్మికులతో మాట్లాడుతున్న సమ్ము రాజయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో బొగ్గు గనుల ప్రైవేటీకరణను కార్మికులంతా కలిసి అడ్డుకోవాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు సమ్ము రాజయ్య తెలిపారు. ఎస్సార్పీ 3 గనిపై మంగళవారం ఆయన కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. సింగరేణిలో బొగ్గు ప్రైవేటీకరణకు అవకాశం కల్పించే బొగ్గుబ్లాక్‌ల వేలంలో పాల్గొనాలని ప్రభుత్వం, కంపెనీ నిర్ణయించిందని, దీనికి కొన్ని కార్మిక సంఘాలు కూడా మద్దతు తెలుపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని, దీన్ని పోరాటాల ద్వారా కార్మికవర్గం అడ్డుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ రాజన్న, ఉపాధ్యక్షులు టీ జైపాల్ సింగ్, నాయకుల పోగుల శేఖర్, గుంపుల జారయ్య, పురంశెట్టి శ్రీధర్‌లు పాల్గొన్నారు.

ప్రైవేట్‌గార్డుల సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో మంగళవారం పలు ఏరియాలకు చెందిన సింగరేణి ప్రైవేటు సెక్యూరిటీ గార్డుల మధ్య క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గరిగే స్వామి, సెక్యూరిటీ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు



అంబులెన్స్‌కు సుస్తీ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని ఎస్అండ్‌పీసీ ఆవరణలోని అంబులెన్స్‌కి సుస్తీ చేసింది. మంగళవారం సమయానికి స్టార్ట్ కాకపోవడంతో అక్కడే ఉన్న సెక్యూరిటీ సిబ్బంది నెట్టి 108 ను స్టార్ట్ చేశారు. మరమ్మతులు చేసి కండీషన్‌లో ఉంచాలని పలువురు సూచిస్తున్నారు.

ఘనంగా ప్లంబర్స్ డే

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ప్లంబర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ప్లంబర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్మికశాఖ అధికారి రామ్మోహన్‌తో కలిసి ప్లంబర్స్ కేక్ కట్ చేశారు.

కంటి పరీక్షలు

చెన్నూర్: చెన్నూర్ మైనార్టీ ఫంక్షన్‌హాల్లో డాక్టర్ బాస్కర్ మాదేకర్ ఉదార నేత్ర వైద్యశాల రేకుర్తి సౌజన్యంతో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 150 మంది హాజరు కాగా, 100 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు జాడి తిరుపతి తెలిపారు.

సంక్షిప్త వార్తలు

టీషర్ట్స్ ఆవిష్కరణ

మంచిర్యాలటౌన్: పట్టణంలోని రాముని చెరువు వాకర్ అసోసియేషన్‌కు సంబంధించిన టీషర్ట్స్‌ను మంగళవారం మంచిర్యాల నగరపాలక సంస్థ కమిషనర్ శివాజి ఆవిష్కరించారు.

ఆనంద నిలయానికి చేయూత

మంచిర్యాలటౌన్: పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన నరేందర్‌రావు కుమారుడు వై.సాయి శరత్ అమెరికాలో ఉద్యోగం చేస్తుండగా, తనకు వచ్చిన మొదటి జీతం నుంచి రూ.25వేలను ఆనంద నిలయానికి మంగళవారం డునేట్ చేశారు.

పరీక్ష కేంద్రం పరిశీలన

కాసిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని మంగళవారం మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పరిశీలించారు. కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

పరీక్ష ప్యాడ్‌లు అందజేత

జన్నారం: మండలంలోని కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదే గ్రామానికి చెందిన స్వచ్ఛంద సంస్థ నాయకుడు జంగం సంతోష్, పాఠశాల విద్యార్థులకు ప్యాడ్, పెన్నులు, జామెట్రీ పరికరాలను పంపిణీ చేశారు.